క్లుప్తంగా

రేపు స్పాట్ కౌన్సెలింగ్

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మిగిలిగిన సీట్లకు ఈనెల 21 వ తేదీన స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శివకల్యాణి శనివారం ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి సీట్లు మిగలడంతో వాటిని భర్తీ చేసేందుకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎస్టీ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో కళాశాలకు హాజరు కావాలని సూచించారు.

దరఖాస్తుల స్వీకరణ

ఏటూరునాగారం: ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థినులు ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో కోర్సు చదివేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శివకల్యాణి శనివారం ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని పీఎంఆర్సీ ఆవరణంలోని గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ విభాగానికి ప్రభుత్వ అనుమతి లభించిందని పేర్కొన్నారు. ఈనెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 23 సీట్లు కేటాయించినట్లు వెల్లడించారు. వివరాలకు 8978905817, 9110737231, 8639191245 సంప్రదించాలని సూచించారు.

తహసీల్దార్‌కు సన్మానం



ఏటూరునాగారం: తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సంధ్యారాణిని మండలంలోని కాంగ్రెస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మండల పరిస్థితులపై చర్చించి కొండాయి జంపన్న వాగు వద్ద బోటు ఏర్పాటు చేసి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘు, ఉపసర్పంచ్ అరుణ, ఆయూబ్, నర్సింగరావు, ముక్కెర లాలయ్య, ముత్తేష్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా శ్రీనివాస్

మహాముత్తారం: మహాముత్తారం తహసీల్దార్‌గా శ్రీనివాస్‌ను నియమిస్తు కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. గతంలో ఉన్న తహసీల్దార్ బదిలీకాగా డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సందీప్‌కు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు. కాగా, మల్హర్ మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌ను మహాముత్తారం తహసీల్దార్‌గా బదిలీ చేశారు.

కమిటీ ఎన్నిక

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి పట్టణంలోని కన్‌స్ట్రక్షన్ వర్కర్స్(ఏఐటీయూసీ) యూనియన్ నూతన పట్టణ కమిటీని జిల్లా కేంద్రంలో శనివారం ఎన్నుకున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుదుల వెంకటేశ్ తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా శివరాత్రి రమేష్, ఉపాధ్యక్షులుగా సిద్ధం రాజు, ఇప్పకాయల మోహన్, ప్రధాన కార్యదర్శిగా రవి, సహాయ కార్యదర్శులుగా జ్యోతిబాబు, గాజుల నరేష్, కోశాధికారిగా ఎండీ వలీ, కార్యవర్గ సభ్యులుగా వేముల రాజు, రాంబాబు, ఓదెలు, దేవేందర్ తదితరులను ఎన్నుకున్నట్లు ఆయన వెల్లడించారు.

రైతు పక్షపాతి సీఎం కేసీఆర్

మల్హర్: రైతుల సంక్షేమానికి దేశంలో ఎక్కడ లేని పథకాలను అమలు చేస్తున్న సీఎం కేసీఆర్ రైతు పక్షపాతిగా నిలిచారని పీఏసీఎస్ చైర్మన్ మల్క సూర్యప్రకాష్‌రావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. తాడిచర్ల ప్రాథమిక సహకార పరపతి సంఘం నందు లక్ష రూపాయల లోపు పంట రుణాలు తీసుకున్న 53 మంది రైతులకు గాను రూ.35,69,311 వారి ఖాతాలో తెలంగాణ ప్రభుత్వం జమచేసినట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ ద్వారా చేసిన సీఎం కేసీఆర్, వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి రాకేష్, పెద్దపల్లి జెడ్పీచైర్మన్ పుట్ట మధుకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాజీనామా

కాటారం: బీఆర్ఎస్ పార్టీ యూత్ విభాగం కాటారం సబ్ డివిజన్ అధ్యక్షుడి పదవికి రాజీనామా చేస్తున్నట్లు నాయిని శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత కొంత కాలంగా నాయిని శ్రీనివాస్ బీఆర్ఎస్‌లో క్రియాశీలంగా ఉంటూ బీఆర్ఎస్ యూత్ సబ్ డివిజన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. కాగా పలు వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేస్తున్నట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు. తన రాజీనామా పత్రాన్ని పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్‌కి అందజేయనున్నట్లు తెలిపారు.

వీడని ముసురు

కాటారం: మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు వర్షం ఏకధాటిగా కురిసింది. ఉదయం నుంచి వర్షం కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.

తొలగని రవాణా కష్టాలు

- పట్టించుకోని పాలకులు
- పస్రా నుంచి బస్సుల రాకపోకలకు అనుమతి ఇవ్వని అధికారులు
- ప్రయాణికులకు తప్పని కష్టాలు



భారీ వర్షాలకు నార్లాపూర్ వద్ద బురదమయంగా మారిన రోడ్డు

ఎస్ఎస్ తాడ్వాయి : ఏజెన్సీ ప్రజలకు రవాణా కష్టాలు తప్పడం లేదు. గత నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా పస్రా సమీపంలోని గుండ్లవాగు బ్రిడ్జి పిల్లర్లు దెబ్బతినడంతో పస్రా నుంచి తాడ్వాయి మీదుగా ఏటూరునాగారం హైవేపైకి ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలను అధికారులు అనుమతించడం లేదు. దీంతో ఏటూరునాగారం నుంచి తాడ్వాయి మీదుగా హనుమకొండ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు పస్రా – మేడారం మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. తాడ్వాయి నుంచి హైవే మార్గాన పస్రా వరకు కార్లు, జీపులు, తదితర చిన్న వాహనాలు మాత్రమే నడిచేందుకు వీలుంది. అయితే మేడారం మీదుగా బస్సులు నడపడంతో ఆర్టీసీ బస్సు చార్జీలు కూడా పెరిగాయి. పల్లె వెలుగు బస్ చార్జీ రూ.20, ఎక్స్‌ప్రెస్ రూ.30, సూపర్ లగ్జరీ రూ.40 వరకు చార్జీలను పెంచారు. ప్రయాణికులకు చార్జీల భారంతో పాటు 20 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. అయితే దెబ్బతిన్న గుండ్లవాగు బ్రిడ్జి ఫిట్‌నెస్‌పై రిపోర్ట్ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సంబంధిత ఎన్‌హెచ్ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసినా ఇప్పటి వరకు అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల రవాణా కష్టాలు మంత్రులు, ప్రజాప్రతినిధులకు కనిపించినా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహిస్తున్నారు.

దెబ్బతింటున్న రోడ్లు..

తాడ్వాయి నుంచి మేడారం మీదుగా ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు, ఇసుక లారీలు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాడ్వాయి నుంచి మేడారం, పస్రా వరకు తారు రోడ్డు ఉండడంతో భారీ వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేకపోయినప్పటికీ తప్పని పరిస్థితుల్లో వెళ్తున్నాయి. దీంతో రోడ్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. దీనికి తోడు మళ్లీ మూడు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో బస్సులు, వాహనాల రాకపోకలతో రోడ్ల మరింత ధ్వంసమవుతున్నాయని, ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని గుండ్లవాగు బ్రిడ్జి మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



వెంగ్లాపూర్ - ప్రాజెక్టునగర్ మధ్యలో గుంతలుగా మారిన రోడ్డు



పస్రా దయ్యాలవాగు వద్ద బురదమయంగా మారిన రోడ్డు

వర్షానికి కొట్టుకుపోయిన రహదారి



వరదనీటిలో వాహనాలను తోసుకొని వెళ్తున్న వాహనదారులు

వెంకటాపురం(ఎం): రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి బూర్గుపేట శివారులో ఇటీవల తాత్కాలికంగా పునరుద్ధరించిన రహదారి కొట్టుకుపోయింది. 20 రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో బుర్గుపేట పరిధిలోని మారెడుగొండ చెరువుకు గండి పడి రోడ్డు మొత్తం కొట్టుకుపోయింది. దీంతో పది రోజుల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఇటీవల కాలంలో కొట్టుకుపోయిన రహదారిపై గ్రావెల్ పోసి తాత్కాలికంగా రోడ్డును పునరుద్ధరించారు. శనివారం ఉదయం మారెడుగొండ చెరువు ద్వారా వచ్చే వరద నీటికి రోడ్డు కొట్టుకుపోయి రోడ్డు పైనుంచి వరదనీరు వెళ్తోంది. దీనితో వెంకటాపురం ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు భారీకేడ్లను ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. దీంతో లక్ష్మీదేవిపేట–బుర్గుపేట గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోవాలని కోరారు.

మట్టిపోసి డబ్బులు దండుకున్నారు..

మండల పరిధిలోని మారెడుగొండ చెరువు వద్ద పునరుద్ధరించిన తాత్కాలిక రోడ్డు పనుల్లో నాణ్యత లోపించడం మూలంగానే వర్షానికి మళ్లీ కొట్టుకుపోయిందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్ ఆరోపించారు. కొట్టుకుపోయిన రహదారిని మండలాధ్యక్షుడు కారుపోతుల యాదగిరి, నాయకులు శ్రీధర్, సోనాసింగ్, సంతోష్‌తో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాత్కాలికంగా రోడ్డును పునరుద్ధరించడంలో సంబంధిత కాంట్రాక్టర్ మట్టిపోసి చేతులు దులుపుకుని డబ్బులు దండుకున్నాడని ఆరోపించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పాటు కాంట్రాక్టర్‌కు అవగాహన లేక పైపులను ఎత్తుగా వేయడం వల్ల నీరు పైపుల నుంచి వెళ్లలేక రోడ్డు కొట్టుకుపోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును వెంటనే పునరుద్ధరించి రాకపోకలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



వరద ఉధృతికి కొట్టుకుపోయిన రోడ్డు

‘బాధితులను ఆదుకోని ప్రభుత్వం’

భూపాలపల్లి రూరల్: మోరంచపల్లి గ్రామం నీట మునిగి 25 రోజులు కావస్తున్నప్పటికీ బాధితులను ప్రభుత్వం ఆదుకోలేదని బీజేపీ వరంగల్ పార్లమెంట్ కో–కన్వీనర్, పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చాడ రఘునాథ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామస్తులు సర్వం కోల్పోయి కట్టు బట్టలతో ఉన్న గ్రామ ప్రజలకు ప్రభుత్వం రూ.10వేలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చింతమడక గ్రామానికైతే కుటుంబానికి రూ.10 లక్షలు ఇచ్చారని, మోరంచపల్లి గ్రామ ప్రజలకు మాత్రం పదివేల రూపాయలతో సరిపెట్టుకోవడం శోచనీయమన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, సింగరేణి కార్మికులు మోరంచపల్లి గ్రామ ప్రజల కోసం ఇచ్చిన నిధులను వెంటనే గ్రామస్తులకు అందించాలన్నారు. వరదల్లో నష్టపోయిన ప్రతీ కుటుంబానికి పాడిపశువులు, పంటలు నష్టపోయిన కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం అందించే విధంగా స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చొరవ ఆయన డిమాండ్ చేశారు.

ఇళ్ల స్థలాలను కేటాయించాలి

టేకుమట్ల(రేగొండ): ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరుతూ శనివారం రేగొండ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సత్యనారాయణస్వామికి జర్నలిస్టులు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అక్రిడిటేషన్, నాన్ అక్రిడిటేషన్ జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరారు. నిత్యం ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పని చేస్తూ నిరంతరం ప్రజల మధ్య ఉంటున్న తమ శ్రమను ప్రభుత్వం గుర్తించాలన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఇళ్ల స్థలాల మంజూరుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పల్నాటి రాజు, రమేష్, భిక్షపతి, ఆనంద్, కమలాకర్, మధు, రాకేష్, రణధీర్, బోయిని రాజు, మార్త రాజు పాల్గొన్నారు.

పౌరులకు ఓటుహక్కు వజ్రాయుధం



మాట్లాడుతున్న తహసీల్దార్ వీరస్వామి

మంగపేట : ప్రజాస్వామ్య భారతదేశంలో ఓటుహక్కు వజ్రాయుధమని, 18 ఏళ్ళు నిండిన యువతి, యువకులు ఓటుహక్కు పొందాలని తహసీల్దార్ బైరి వీరస్వామి సూచించారు. తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా 18 ఏళ్ళు నిండిన ప్రతీ యువతి, యువకుడు ఓటుహక్కు కలిగి ఉండి స్వచ్ఛందంగా ఓటు వేయాలని సూచించారు. జిల్లాల్లో 18 సంవత్సరాలు నిండిన కొత్త ఓటర్ల నమోదు సంఖ్య అతితక్కువగా ఉందని, అందుకు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వారిగా బీఎల్ఓలతో ఇంటింటికెళ్లి అర్హులైన ప్రతీ ఒక్కరిని గుర్తించి ఓటరుగా నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. యువకులు ఓటుహక్కుపై ఇతరులకు అవగాహన కల్పించాలన్నారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటానని, అన్ని రకాల సేవలు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఎలాంటి సమస్య వచ్చిన నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి రావాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఆర్ఐ నేత కుమారస్వామి, ఏఆర్ఐ ఏసుపాదం, జూనియర్ అసిస్టెంట్ నందకిశోర్ రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషితోనే అనుమతులు

మల్హర్: మండలంలోని పెద్దతూండ్ల కిషన్‌రావుపల్లి నుంచి భూపాలపల్లి జిల్లా కేంద్రం వరకు సింగిల్ రోడ్డు నిర్మాణం కోసం అటవీ అనుమతులు రావడానికి జాతీయ కాంగ్రెస్ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు కృషి ఎనలేదని కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు గడ్డం క్రాంతి తెలిపారు. మండలంలోని తాడిచర్లలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. కొన్నేళ్లుగా అటవీ అనుమతుల కోసం ఎమ్మెల్యే, ఎంపీపీ సంబంధించిన అటవీశాఖ మంత్రి, ఫారెస్ట్ ఉన్నతాధికారులు, కలెక్టర్‌ను పలుమార్లు కలిసి అనుతులు వచ్చేల చర్యలు తీసుకోవాలని కోరినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఇందారపు చంద్రయ్య తదితరులు ఉన్నారు.

లూయీస్ డాగురేకు ఘన నివాళి



లూయిస్ డాగురే చిత్రపటం వద్ద కేక్ కట్ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

మంగపేట: మండల కేంద్రంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఫొటో పితామహుడు లూయిస్ దాగురే చిత్రపటాన్ని పూలమాలతో సత్కరించి కేక్ కట్‌చేసి నివాళులర్పించారు. అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ కోటి అక్షరాలతో చెప్పలేని భావాన్ని ఒకే చిత్రంలో చూపేదే ఫొటో అని తెలిపారు. ఫొటోగ్రఫీ వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారందరిని ప్రభుత్వం గుర్తించి సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు వడ్ల కొండ శ్రీనివాస్, జిల్లా ఆర్గనైజర్ అక్కపెల్లి రాజేష్, మండల అధ్యక్షుడు అక్కపెల్లి నరేష్, ప్రధాన కార్యదర్శి కార్తీక్, మహేష్, గణేశ్, కమలాకర్, శ్రీకాంత్, సాయి, ప్రవీణ్, శ్రావణ్, విశ్వనాథ్, సాయిరాజ్, రమేష్ పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



పెంకవాగు వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

వెంకటాపురం(కె): మండలంలోని తిప్పాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పెంకవాగు వద్ద సర్పంచ్, గ్రామ పంచాయతీ సిబ్బంది హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెంకవాగు పొంగి ప్రవహిస్తోంది. ప్రజలను, ప్రయాణికులను ముందస్తుగా అప్రమత్తం చేస్తూ ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ప్రయాణికులు రాకపోకలు సాగించవద్దని కోరారు.

అర్హులకు కొత్తరేషన్ కార్డులు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిటమట రఘు

ఏటూరునాగారం: అర్హులైన వారికి రాష్ట్ర ప్రభుత్వం కొత్తరేషన్ కార్డులు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఏడు సంవత్సరాల నుంచి కొత్తరేషన్ కార్డులు జారీ చేయకపోవడంతో అర్హులైన లక్షలాది మంది ప్రజలు సంక్షేమ పథకాలు కోల్పోతున్నారని అన్నారు. అదే విధంగా పింఛన్‌లు, ఆరోగ్యశ్రీ, బీసీ బంధు, గృహలక్ష్మి, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు, బ్యాంక్ లోన్లు వివిధ సంక్షేమ పథకాలకు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు ముఖ్యంగా అవసరం ఉంటుందన్నారు. రేషన్‌కార్డులు లేని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం 2018 డిసెంబర్‌లోపు రైతులు తీసుకున్న పంట రుణాలను మాఫీ చేసినప్పటికీ బ్యాంకు అధికారులు మాఫీ అయిన రైతుల పేర్లతో కూడిన లిస్టును ప్రదర్శించలేదని అన్నారు. వెంటనే బ్యాంకుల్లో రుణమాఫీ జాబితాను ప్రదర్శించాలన్నారు. ఏటూరునాగారం ఉపసర్పంచ్ కర్ల అరుణ, నాయకులు వావిలాల నర్సింహారావు, ముక్కెర లాలయ్య, గుడ్ల దేవేందర్, వావిలాల చిన్న ఎల్లయ్య, చెన్నూరు బాలరాజు, రియాజ్, జోంగిరి మధుబాబు, చేల వినయ్, లాల్ మహమ్మద్, పడిదల హనుమంత్, కుదురుపాక శ్రీనివాస్, సిరాజ్, సర్వ అక్షిత్, బండారి లక్కీ, మండల సహాయ కార్యదర్శి ఈసం జనార్దన్, సాధనపెల్లి లక్ష్మయ్య, తాళ్లపెల్లి నరేందర్, గడ్డం మహేష్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిపై కక్షసాధింపు సరికాదు



మాట్లాడుతున్న బొల్లు దేవేందర్

ఎస్ఎస్ తాడ్వాయి : టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై రాష్ట్ర సర్కార్ కక్షసాధింపు చర్యలకు పూనుకుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి భద్రతా సిబ్బందిని తగ్గించడం సిగ్గుచేటన్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రేవంత్‌కు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక సీఎం కేసీఆర్ కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటమని భయం పట్టుకుందని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకి రానున్నది కాంగ్రెస్ పార్టీనే అని గుర్తుంచుకోవాలని అన్నారు. రేవంత్‌రెడ్డికి ఫోర్ ప్లస్ ఫోర్ సెక్యూరిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. అదే విధంగా గత నెలలో కురిసిన వర్షాలు, వరదలకు రోడ్లు దెబ్బతిన్నాయని, నెల రోజులు సమీపిస్తున్న అధికారులు, ప్రభుత్వానికి చలనం లేదన్నారు. ఏజెన్సీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా కళ్లు తెరవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇర్ప సునీల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య, డైరెక్టర్లు యానాల సిద్ధిరెడ్డి, జగదీశ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, ఎస్టీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకన్న, తిరుపతి, రమేష్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వరద ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు

మంగపేట: మండలంలో గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి తుల రవి సూచించారు. జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశాల మేరకు మండలంలోని పొదుమూరు వద్ద గోదావరి వరద కోతకు గురవుతున్న ఒడ్డు ప్రాంతాన్ని తహసీల్దార్ బైరి వీరస్వామితో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం నర్సింహసాగర్ పంచాయతీ పరిధిలోని శనిగకుంటకు వెళ్లే ప్రధాన రోడ్డుపై నిర్మించిన లోలెవల్ కాజ్‌వేపై నుంచి ప్రవహిస్తున్న వరద ఉధృతిని పరిశీలించారు. వరదనీరు తీవ్రత అధికమవుతుందని, రాకపోకలు నిలిపి వేసి, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శి రూప్‌సింగ్‌ను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ప్రాణ, ఆస్థి నష్టం జరుగకుండా ఉండేందుకు ముందుస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, భవనాలు, గోడలు కూలిపోయే ప్రమాదం ఉంటుందని అలాంటి ఇళ్లలో ఎవరూ ఉండొద్దని హెచ్చరించారు. ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఓ శ్రీనివాస్, ఆర్ఐ కుమారస్వామి పంచాయతీ కార్యదర్శి, మాలోత్ హీరూ, రూప్‌సింగ్ తదితరులు ఉన్నారు.

45 మంది విద్యార్థులకు ఒక్కరే టీచర్



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న స్థానిక సర్పంచ్ నర్సిమూర్తి

వెంకటాపురం(కె): మండలంలోని చిరుతపల్లి జీపీఎస్, బాలికల ఆశ్రమ పాఠశాలల్లో 45 మంది విద్యార్థులకు ఒక్కరే టీచర్ ఉన్నారని, ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని స్థానిక సర్పంచ్ కొర్స నర్సిమూర్తి అన్నారు. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులే ప్రణాళిక రచించాలని సూచించారు. 45 మంది విద్యార్థులకు ఒకే టీచర్ బోధించడంతో పిల్లల చదువుపై ప్రభావం పడుతుందని వెంటనే విద్యా వాలంటీర్‌ను ఏర్పాటు చేసుకుందామని సర్పంచ్ కోరారు. అందుకు అనుగుణంగా ప్రతీ విద్యార్థి తల్లిదండ్రులు రూ. 200 సమకూర్చాలని తీర్మానించారు. ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యార్థులు చదువును కోల్పోతున్నారని అన్నారు. ఉపాధ్యాయుల నియామకం విషయంలో ఐటీడీఏ డీడీ పోచంను పలుమార్లు కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రధానోపాధ్యాయుడు నగరాజు, విద్యార్థులు తల్లిదండ్రులు ఉన్నారు.

కుమారస్వామి మృతి పార్టీకి తీరనిలోటు



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీతక్క

ములుగు: కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు నల్లెల కుమారస్వామి సేవలు మరువలేనివని ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం కుమారస్వామి ఆరోనెల మాసికానికి ఆమె హాజరై మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ కాలనీకి చెందిన కాకి లక్ష్మి ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవిచందర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవియాదవ్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, ఎంపీటీసీ తిరుపతిరెడ్డి, పట్టణ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు అశోక్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేవంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.